
కథ

అబ్బరాజు జయలక్ష్మి



# నానమ్మా జిందాబాద్!

'ఆరంభింపరు నీచ మానవులు..ఆరంభింపరు నీచమానవులు.. ఆరంభింపరు..' అంటూ పద్యాన్ని కంఠస్థం చేయటానికి అరగంటనుండి అవస్థపడుతున్న అరవింద్ దగ్గరకు వచ్చింది సుభద్రమ్మ.

"ఏమిట్రా! ఎంతసేపు చదువుతావు ఆ పద్యాన్ని? ఇందాకటినుంచి వింటున్నాను. రోట్లో పచ్చడి వేసి రుబ్బినట్లు నోట్లో పద్యం నలుగుతూనే ఉంది. ఇంకా రాలేదా!"

"అబ్బా! రావటం లేదు నానమ్మా! ఈ పద్యం కంఠస్థం చేసుకుని రమ్మన్నది మా టీచర్. ఎంత చదివినా ఒక్క లైను కూడా గుర్తుండటం లేదు"

"పద్యం నోటికి రావాలంటే దాని అర్థం కూడా తెలిసుండాలిరా. అర్థంలేని చదువు వ్యర్థం. అర్థం చేసుకుని చదివావంటే ఏదయినా తొందరగా వంటపడుతుంది. ఎప్పటికీ గుర్తుంటుంది"

"అయితే నాకు ఈ పద్యానికి అర్థం చెప్పవా నానమ్మా!"

"అలాగే చెబుతాను. శ్రద్ధగా విను మరి. అధములైన వారు ఆటంకాలు వస్తాయని భయపడి ఏ పనినీ మొదలు పెట్టరు. మధ్యములు పనిని మొదలుపెట్టి ఆటంకం కలుగగానే ఆపివేస్తారు. ఉత్తములైనవారు ఎన్ని విఘ్నాలు వచ్చినా మొదలుపెట్టిన పనిని పూర్తి చేయనిదే విశ్రమించరు. ఇదన్నమాట ఆ పద్యానికి భావం. ఇప్పుడు చదువుకో. ఐదు నిమిషాల్లో పద్యం వచ్చేస్తుంది" అంటూ లోపలికి వెళ్ళింది సుభద్రమ్మ.

అరవింద్ శ్రద్ధగా పద్యం బట్టీపట్టి నానమ్మ దగ్గరకు వెళ్ళి పద్యం అప్పచెప్పేశాడు. మనవడిని మెచ్చుకుంటూ సుభద్రమ్మ డబ్బాలోనుండి మైసూర్‌పాక్ ముక్క తీసి అరవింద్ నోట్లో పెట్టింది.

"సుభద్రా! సుభద్రా!" అంటూ పిలిచారు రామచంద్రయ్యగారు.

"రెండక్షరాలలో వచ్చే ఏనుగుకు మరో పేరు ఏమిటో చెప్పవోయ్ ఎంతకీ గుర్తు రావటం లేదు"

"దంతి అంటే ఏనుగే కదండీ!" అని వెంటనే బదులిచ్చింది ఆవిడ.

"అవును కదూ! ఇందాకటి నుండి ఆలోచిస్తున్నాను. నాకు తట్టనే లేదు సుమా! ఏదయినా నువ్వు ఇట్టే చెప్పేస్తావు. అందుకే నిన్ను పిలిచాను" అంటూ ఆ మాట రాసేసి పజిల్ పూర్తి చేశారు ఆయన.

నవ్వుకుంటూ అవతలికి వెళ్ళింది సుభద్రమ్మ.

పత్రికలలో వచ్చే అన్ని రకాల పజిల్స్, పదకేళి, సుడోకులాంటివి పూర్తిచేయడమంటే ఆయనకు సరదా. కాలక్షేపం కూడాను. ఆయనకు ఎంతకీ దొరకని చిక్కుప్రశ్నలన్నిటికీ సుభద్రమ్మ దగ్గర చిటికెలో సమాధానం దొరుకుతూ ఉంటుంది. అందుకే ఆయన బుర్రకు అందనివాటిని భార్య ఎక్కడున్నా పిలిచి మరీ అడుగుతూ ఉంటారు. ఆయనకు ఆ విధంగా పజిల్స్ పూర్తిచేయటంలో ఆసక్తిని కలిగించింది సుభద్రమ్మే. అప్పటినుండి అదొక అలవాటుగా మారింది ఆయనకు.

సుభద్రమ్మ, రామచంద్రయ్యలకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు ఆనంద్, కోడలు అపర్ణ. వాళ్ళకు ఇద్దరు పిల్లలు. అరవింద్, సౌజన్య. అరవింద్ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. సౌజన్య ఇంటర్ ఫైనల్ ఇయర్. రెండవ కొడుకు సత్యమూర్తి. కోడలు సువర్ణ. వాళ్ళకు ఒక్కడే కొడుకు నిఖిల్. అమెరికాలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. సత్యమూర్తి తన ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళి కుటుంబంతో సహా అక్కడే స్థిరపడ్డాడు. ఏడాదికోసారి వచ్చి వెళుతుంటారు. నిఖిల్‌కి నానమ్మ చేసిపెట్టే పిండివంటలన్నా ఆమె చెప్పే కథలన్నా ప్రాణం. సువర్ణకు కూడా జాయింట్ ఫ్యామిలీ అంటే ఇష్టం. తను అత్త, మామ, తోటికోడలు, బావగారు అందరికీ దూరంగా ఉండటం వల్ల ఎన్నో ఆనందాలను, అనుభూతులను మిస్ అవుతున్నానని అనుకుంటూ ఉంటుంది. అందుకే వీలయినంత త్వరలో ఇండియాకు తిరిగి వచ్చేయాలని అందరూ కలిసి ఉండాలని సత్యమూర్తి కూడా ఆలోచిస్తున్నాడు.

* * *

"అత్తయ్యా! మీకోసం సుందరమ్మగారు వచ్చారు" అంటూ పెరట్లో పూలుకోసి మాలకడుతున్న సుభద్రమ్మగారి దగ్గరకు వచ్చి చెప్పింది అపర్ణ. అత్తగారన్నా, ఆవిడ అభిప్రాయాలు ఆలోచనలన్నా అపర్ణకు చాలా గౌరవం. తనకు తెలియని వాటి గురించి ఆమెను అడిగి మరీ తెలుసుకుని ఆచరిస్తూ ఉంటుంది. అలాంటి తెలివైన మంచి అత్తగారు దొరకడం తన అదృష్టం అనుకుంటూ ఉంటుంది. మా అత్తగారి దగ్గర ఇవి నేర్చుకున్నాను అవి నేర్చుకున్నాను అని గొప్పగా చెప్పుకోవటమంటే ఆమెకు ఇష్టం. సుభద్రమ్మగారు కూడా కోడలితో కలివిడిగా ఉంటూ అభిమానం చూపిస్తూ కూతురు లేని లోటు తీరిందనుకుంటుంది. అమెరికా నుండి సత్యమూర్తి వాళ్ళు వచ్చినప్పుడల్లా ఇక ఇల్లంతా పండగ వచ్చినంత సందడిగా వుంటుంది.

"ఏం సుందరమ్మ వదినా! ఏమిటి విశేషాలు?" అంటూ పలకరించింది సుభద్రమ్మ.

"అమ్మాయికి సంబంధం కుదిరింది వదినా. శుభవార్త ముందుగా నీ చెవిన వేసి పోదామని ఇటు వచ్చాను"

"చాలా సంతోషం. ఇక నీ బెంగ తీరినట్లే కదా!"

"అంతా నీ పుణ్యమేనమ్మా! నీ మాటలు విని నువ్వు చెప్పిన సలహా పాటించటం వల్లనే ఇలా జరిగింది. అందుకు నీ మేలు ఎప్పటికీ మరచిపోలేను వదినా!" అంటూ సుభద్రమ్మ చేతులు పట్టుకుని కళ్ళకద్దుకుని వెళ్ళింది ఆవిడ.

రెండు నెలల క్రిందటి విషయం గుర్తుకు వచ్చింది సుభద్రమ్మకు. సుందరమ్మ పక్కవీధిలోనే ఉంటుంది. ఆమెకు ఒక కూతురు ఒక కొడుకు. పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడే భర్త గతించడంతో కష్టపడి వాళ్ళను పెంచింది. కొడుక్కి చదువులు పెద్దగా చెప్పించలేనందున చిన్న ఉద్యోగంలో చేరాడు. కూతురికి పెళ్ళి చేయాలని చదువు మానిపించి వేసింది. ఆ అమ్మాయికి ఇంట్లో తిని కూర్చోవటం తప్ప మరే వ్యాపకం లేనందున విపరీతంగా వళ్ళు రావటంతో పెళ్ళి చేయటం పెద్ద సమస్యగా మారింది. 'వేలు ఖర్చుపెట్టి ఒబేసిటీ క్లినిక్‌లకు పంపలేను. ఈ పిల్లకు వళ్ళు తగ్గేదెలాగ, నేను పెళ్ళి చేసేది ఎప్పుడు' అని ఒకసారి సుభద్రమ్మ దగ్గర చెప్పుకుని సుందరమ్మ బాధపడింది. ఆ సంగతి నాకు వదిలిపెట్టమని భరోసా ఇచ్చిన సుభద్రమ్మ ఆ అమ్మాయిని తన దగ్గరకు పిలిపించుకుంది.

"చూడమ్మా నేను కొన్ని చిట్కాలు చెప్తాను. వాటిని నువ్వు తప్పక పాటిస్తావని నాకు మాటిస్తావా" అని అడిగింది.

"తప్పకుండా పాటిస్తాను మామ్మగారు. నాకు కూడా సన్నగా, స్లిమ్‌గా కావాలని వుంది. అందుకే సరిగా తినటం లేదు కూడాను. తిండి తగ్గించినా సన్నబడటం లేదు" అంటూ దిగులుగా చూసింది.

"కాస్త వళ్ళు రాగానే మీ ఆడపిల్లలు ముందు తినటం మానేస్తారు. సరిగా తినకపోవటం వలన నీరసంతోపాటు లేని సమస్యలు వస్తాయి. కాని ప్రయోజనం ఏమీ ఉండదు. నేను చెప్పినట్లు నెలరోజులు చేసి చూడు. నీ శరీరంలో మార్పు తప్పకుండా వస్తుంది" అంటూ చెప్పటం మొదలెట్టింది సుభద్రమ్మ.


"తెల్లవారక ముందే నిద్ర లేవాలి. మధ్యాహ్నం ఎట్టి



పరిస్థితుల్లోను నిద్రపోకూడదు. ఇంటి పనులన్నీ అమ్మకు బదులుగా నువ్వే చకచకా వళ్ళు వంచి చేయాలి. మిక్సీ సంగతి మర్చిపోయి పచ్చళ్ళు, పొడులు రోటిలోనే చేస్తూ వుండు. కాస్త తీపి పదార్థాలు తగ్గించి మామూలుగా భోజనం చేయి. ఇవన్నీ అమలుపరచటంతోపాటు రోజూ వాకింగ్ కూడా చేయాలి" అంటూ ఆవిడ చెప్పిన సలహాలు పాటించిన ఆ అమ్మాయి రెండు నెలల్లోనే వళ్ళు తగ్గి చూడముచ్చటగా తయారయింది. దాని ఫలితంగా వెంటనే పెళ్ళి సంబంధం నిశ్చయమయింది.

* * *

"అమ్మా, మా ఆఫీసులో కొత్త వెంచర్ ప్రారంభించాలి. మంచి రోజు చూసి చెప్పవా!" అని అడిగాడు ఆనంద్. స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి పెద్ద ఆఫీసర్ల హోదాలో ఉన్న పుత్రరత్నాలను చూసి గర్వపడుతూ ఉంటారు సుభద్రమ్మ, రామచంద్రయ్య. 'దేశానికి ప్రధాని అయినా అమ్మకు మాత్రం కొడుకే' అన్నట్లు ఎంత ఎదిగినా వాళ్ళకు అమ్మ అంటే అభిమానం. అమ్మ మాటంటే గురి. ఆమె సలహా సంప్రదింపులు లేనిదే ఏ పనినీ ప్రారంభించరు. నాన్న కంటె అమ్మ దగ్గర ఎక్కువ చేరిక ఆనంద్‌కు. ఇంత వయసులో కూడా అప్పుడప్పుడు అమ్మ ఒడిలో తలపెట్టుకుని పడుకోవటం అంటే ఆనంద్‌కు చాలా ఇష్టం. అతని తల నిమురుతూ చిన్ననాటి ముచ్చట్లు చెపుతూ ఉంటే వింటూ ఆనందిస్తుంటాడు. సౌజన్య, అరవింద్ నాన్న చిన్న పిల్లాడిలా నానమ్మ ఒడిలో పడుకున్నాడు. అని ఆటపట్టిస్తుంటే అమ్మ ఒడిలో ఉండే ఆనందం ఏమిటో మీకు తెలీదులే! పొండి అంటూ నవ్వేస్తాడు. అపర్ణకు ఆ దృశ్యం ఎందుకో చాలా నచ్చుతుంది. ఆ తల్లీ కొడుకుల అనుబంధం గొప్పదిగా అనిపిస్తుంది. మమతానురాగాలు అందరికీ అమితంగా లభించే చోట ఈర్ష్యాసూయలకు తావుండదు మరి!



వేళ్ళమీదే ఒక్క క్షణం లెక్కవేసి 'పంచమి' గురువారం మంచి రోజు అని చెప్పింది సుభద్రమ్మ.

* * *

"నానమ్మా! రేపు నేను మా కాలేజీలో డిబేట్‌లో పాల్గొనబోతున్నాను. 'స్త్రీ సమానత్వం నాడు-నేడు' అనే టాపిక్ గురించి నాకు కొంచెం చెప్పవా!" అంటూ అడిగింది సౌజన్య.

"అలాగే ముందు నువ్వు ఏం చెప్పాలనుకుంటున్నావో అది చెప్పు" అని సౌజన్య కొన్ని విషయాలు చెప్పిన తరువాత

"స్త్రీల అభివృద్ధిని సహించలేక వాళ్ళను అణగదొక్కాలని చూసే పురుషపుంగవులు ఆనాడూ ఉన్నారు. ఈనాడూ ఉన్నారు. ఎన్ని ఆటుపోటులనైనా తట్టుకుని ఎదురైన ఆటంకాలను అడ్డుకుంటూ స్త్రీమూర్తులు తారాజువ్వల్లా ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతూనే వున్నారు. అన్నిటికీ ఎప్పుడైనా కావలసినది స్త్రీలలో ఆత్మవిశ్వాసం. తను సాధించదలచుకున్న విషయంలో కార్యదీక్ష ఇవి ఉన్నంత కాలం ఆడవాళ్ళు పురు

షాహంకారంపై గెలుపును పొందుతూనే ఉంటారు" అంటూ కొన్ని అంశాలను వివరించింది సుభద్రమ్మ.

మర్నాడు సాయంత్రం ఇంటికి వస్తూనే-

"నానమ్మా! యుఆర్ గ్రేట్ నానమ్మా! నువ్వు చెప్పిన మంచి పాయింట్స్ వల్లే నాకు డిబేట్‌లో ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది" అని బహుమతిని నానమ్మ చేతిలో పెట్టింది సౌజన్య.

"నువ్వు చక్కగా మాట్లాడావు కాబట్టే నీకు ప్రైజ్ వచ్చింది" అంటూ మనవరాలిని అభినందించింది సుభద్రమ్మ.

* * *

"పోస్ట్" అనే కేక విని వంటగదిలో నుండి బయటకు వచ్చింది అపర్ణ.

"సుభద్రమ్మగారు ఎవరండీ?"

"అత్తయ్యా! మీకే పోస్ట్!" అంటూ లోపలికి చూస్తూ పిలిచింది అపర్ణ.

"నాకు పోస్టా!" అంటూ వచ్చింది ఆవిడ.

"రిజిస్టర్ పోస్ట్ అండీ!"

"ఎక్కడి నుండి?"

"అమెరికా నుండి" అంటూ ఆవిడ చేత సంతకం చేయించుకుని ఒక పార్శిల్ ఇచ్చి వెళ్లాడు.

పోస్ట్‌మేన్ కేక విని గదిలో నుండి వచ్చిన ఆనంద్, పజిల్స్ పుస్తకంతో రామచంద్రయ్యగారు, చేతిలో గరిటతో అపర్ణ, బేట్ బాల్ పట్టుకుని ఆటలకు వెళ్లబోతున్న అరవింద్, కాలేజీ నుండి అప్పుడే వచ్చిన సౌజన్య అందరూ ఆసక్తిగా పార్శిల్‌లో ఏం ఉందా! అని ఎదురుచూడసాగారు. అందంగా ప్యాక్ చేసి ఉన్న దానిని అతిభద్రంగా విప్పదీసింది సుభద్రమ్మ. అందులో నుంచి 'జన్మదిన శుభకాంక్షలతో నానమ్మకు నిఖిల్ అని రాసి ఉన్న గ్రీటింగ్‌తో పాటుగా అధునాతనమైన చిన్న సైజు లాప్‌టాప్ బయటపడింది.

సుభద్రమ్మగారికి పుట్టినరోజు కానుకగా అమెరికా నుండి మనవడు అపురూపంగా పంపిన ఆ లాప్‌టాప్‌ను చూసి అందరూ సంతోషించారు. తన పుట్టినరోజును గుర్తుంచుకుని అంత దూరం నుండి మనవడు నిఖిల్ పంపిన ఆ కానుకను చూసుకుని సుభద్రమ్మ మనవడిని చూసినట్లే మురిసిపోయింది. ఆవిడ నిఖిల్ కోసమని సౌజన్య దగ్గర కంప్యూటర్ నేర్చుకుంది. వారంలో మూడు రోజులైనా మనవడితో ఛాటింగ్ చేయనిదే ఆమెకు తోచదు. ఇప్పుడు నాన్నమ్మ కోసం ప్రత్యేకంగా బుల్లిలాప్‌టాప్‌నే కానుకగా పంపించాడు నిఖిల్.

"ఇక కొత్తలాప్‌టాప్‌తో అమ్మ బిజీ బిజీ అన్నమాట" అన్నాడు ఆనంద్.

"నాన్నా! నీకో సంగతి తెలుసా! నానమ్మకు కొత్తగా బ్లాగ్ ఓపెన్ చేయటం కూడా వచ్చింది"

"వండర్‌ఫుల్! అమ్మా! నువ్వు ఇంతమందికి ఇన్నిరకాల సలహాలు ఎలా ఇవ్వగలుగుతున్నావు? నీ ఓపికకు హేట్సాఫ్" అన్నాడు మెచ్చుకోలుగా అమ్మను చూస్తూ ఆనంద్.

"మీ అమ్మ జీనియస్‌రా! అన్నింటిలోను మొదటి నుండి తన సలహాలు పాటిస్తున్నాను కాబట్టే నా జీవితం ఇంతవరకు ఏ ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా గడిచింది" అన్నాడు రామచంద్రయ్య.



"చాల్లెండి మీరు కూడాను. ఏమిటా పొగడ్తలు. అంత గొప్పతనం నాలో ఏముందని?" అంటూ నవ్వుతూ సున్నితంగా ఆయనను మందలించింది సుభద్రమ్మ.

అరవై ఐదు వసంతాలు నిండిన ఆమె మోములో ఆనందపు మెరుపులు తలలోని ఫలిత కేశాలలో ప్రతిఫలించాయి.

"నానమ్మా! ఆ సీక్రెట్ ఏమిటో నువ్వు నాకు చెప్పాల్సిందే! ఎందుకంటే రేపు పెద్దయ్యాక నేను కూడా నీలాగా అందరి చేత 'సెభాష్' అనిపించుకోవాలి మరి!" అన్నది సౌజన్య.

"ఎందుకనిపించుకోవూ! నాకంటే భేషుగ్గా అనిపించుకుంటావు. ఇందులో ఏ సీక్రెటూ లేదు. ఈ కంప్యూటర్ యుగంలో ఈ మాత్రం నేనూ నేర్చుకపోతే ఎలా? ఫోన్ లోకంటే కూడా చాటింగ్ చేయటం వల్ల అక్కడెక్కడో ఉన్న మనవడితో ఎక్కువసేపు కబుర్లు చెప్పగలుగుతున్నాను. ఇక్కడి మనవడితో ఆటపాటలు, నీతో కలిసి జాగింగ్, మీ తాతగారితోపాటు వాకింగ్ చేస్తూ, ఆహార నియమాలు పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉన్నాను. అంతేకాదు మీ అందరి అభిమానం, సహకారం అడుగడుగునా నాకు అండగా ఉండబట్టే నేను ఈ విధంగా ఉన్నాను. నాకు తోచిన సలహాలు నలుగురికీ ఇవ్వగలుగుతున్నాను. మూలనున్న ముసలివాళ్ళకు ఏం తెలుసు? అని వాళ్ళను చులకనగా చూడకుండా ఉంటే మారిన కాలంతోపాటు వాళ్ళు కూడా ముందడుగు వేయగలుగుతారు. వెనుకటి తరంవారు అనుభవంతో నేర్పిన పాఠాలను వంటబట్టించుకుని, రాబోయే తరాలవారి ఆలోచనలను బేరీజు వేసుకుంటూ, నేడు ఉన్న పరిస్థితులకు అనుగుణంగా నన్ను నేను మలచుకోగల నేటి నానమ్మను నేను" అంటూ స్థిరంగా పలికింది సుభద్రమ్మ.

"భలే భలే! నానమ్మా జిందాబాద్!" అంటూ అరవింద్ సౌజన్య చప్పట్లు కొడుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిగిలిన వాళ్ళంతా వాళ్ళ నవ్వుల్లో పాలు పంచుకున్నారు.

## పారిస్‌మీద ప్యార్

సెలవులొస్తే నచ్చిన చోటుకి వెళ్లి విశ్రాంతి తీసుకోవడమో, సరదాగా గడపడమో చేస్తాం కదా! సినిమా తారలైతే ఇక చెప్పేదేముంది? విదేశాలకే చెక్కేస్తారు. కొన్ని దేశాల్లో కొన్ని నగరాలంటే తెగ ఇష్టపడతారు కూడా. కత్రినా కైఫ్‌కి పారిస్ నగరం అంటే మాచెడ్డ ఇష్టంట. ఏమాత్రం సెలవులు దొరికినా చాలు, పారిస్‌లో సరదాగా గడిపేందుకు ఇష్టపడతానంటుంది కత్రినా. ప్రస్తుతం అక్కడే ఓ హిందీ చిత్రం షూటింగ్‌లో వున్న కత్రినా ఆ షెడ్యూల్ అయిపోయాక కూడా కొన్నాళ్లు అక్కడే వుండి వస్తుందిట.